విశాలాంధ్ర అనంతపురం
www.visalaandhra.com కర్నూలు, సోమవారం 20, జనవరి 2025

ప్రశాంతంగా ముగిసిన ఇజితెమా

విశాలాంధ్ర-నార్పల : మండల కేంద్రంలో రెండు రోజులు పాటు జరిగిన జిల్లా ఇజితెమా ఆదివారం సాయంత్రం ప్రశాంతంగా ముగిసింది. ఆదివారం జరిగిన సామూహిక దువా కార్యక్రమానికి వేలాదిమంది ముస్లింలు హాజరయ్యారు. మహ్మద్ ప్రవక్త నిర్దేశించిన మార్గదర్శకాలతో పాటు ప్రపంచశాంతి, దేశ ఔన్నత్యం గురించి మతపెద్దలు వివరించారు. ఇజితిమా వచ్చిన వారికి అవసరమైన తాగునీరు, మరుగుదొడ్లు, స్నానపుగదులు, విద్యుత్ సదుపాయలు సమకూర్చారు. భోజన వసతిని కల్పించారు. రెండు రోజులు పాటు ఎలాంటి అవాంఛనీయ ఘటనలు, అపశృతులు చోటు చేసుకోకుండా శింగనమల సీఐ కాలుట్లయ్య, ఎస్ఐ సాగర్ డ్రోన్లతో నిరంతరం నిఘా ఉంచి ఎప్పటికప్పుడు పర్యవేక్షించారు. అన్ని విధాలా సహకరించిన సీఐ, ఎస్సైలకు ముస్లిం సోదరులు కృతజ్ఞతలు తెలిపారు.

దార్శనికుడు యోగి వేమన

విశాలాంధ్ర-కళ్యాణదుర్గం : ప్రజాకవి యోగి వేమన జయంతి వేడుకలను కళ్యాణదుర్గం వైసీపీ కార్యాలయంలో నియోజకవర్గ సమన్వయకర్త తలారి రంగయ్య ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. యోగి వేమన చిత్రపటానికి పూలమాలేసి నివాళులర్పించారు. అనంతరం తలారి రంగయ్య మాట్లాడుతూ కుల మతాలు, ప్రాంతీయ భేదాలు, లింగ వివక్ష లేకుండా ప్రతి మనిషీ మానవీయ విలువలను నిలుపుకుంటూ ఎలా బతకాలో చెప్పిన మానవవాది వేమన అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో వైసీపీ రాష్ట్ర కార్యదర్శి బోయ తిప్పేస్వామి, ముఖ్య నాయకులు మాదినేని ఉమా మహేశ్వర్ నాయుడు, మున్సిపల్ చైర్మన్ రాజ్ కుమార్,చంద్రశేఖర్‌రెడ్డి, రేవన్న గౌడ్, ఎమ్మెస్ రాయుడు, గోళ్ళసూరి, శ్రీకాంత్ రెడ్డి పాల్గొన్నారు.

23న రక్తదానం చేద్దాం..

విశాలాంధ్ర-కళ్యాణదుర్గం టౌన్ : మంత్రి ముఖ్యమంత్రి తనయుడు నారా లోకేష్ జన్మదినం సందర్భంగా గ్రామ గ్రామాన రక్తదానం చేసి ప్రాణదాతలు అవుదామని ధర్మతేజ, తెదేపా సీనియర్ నాయకులు పిలుపునిచ్చారు. ఆదివారం ప్రజా వేదికలో నాయకులు కార్యకర్తలతో సమావేశం ఏర్పాటుచేసి మాట్లాడుతూ ఐటి, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ జన్మదిన వేడుకను ఈనెల 23న ఇక్కడే మెగా రక్తదానం చేద్దామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకులు మోరేపల్లి మల్లికార్జున, రామ్మోహన్ చౌదరి, గోళ్ళ వెంకటేశులు, శివన్న, షేక్‌శర్మాస్ వలి, పాల వెంకటాపురం శ్రీరాములు పాల్గొన్నారు.

సీనియర్ జర్నలిస్ట్ పురుషోత్తం ఆకస్మిక మృతి ..

విశాలాంధ్ర-కళ్యాణదుర్గం : పాత్రికేయ వృత్తిలో సుదీర్ఘకాలం పని చేస్తున్న గన్నే పురుషోత్తం (50) ఆదివారం ఉదయం మృతి చెందారు. కళ్యాణదుర్గం నియోజకవర్గంలో ఆర్టీవి ఛానల్ రిపోర్టర్‌గా పనిచేస్తున్న పురుషోత్తం రెండు రోజులుగా జ్వరంతో బాధపడుతూ ఆకస్మికంగా మృతి చెందడం పట్ల పాత్రికేయ మిత్రులు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఆదివారం ఉదయం పురుషోత్తం తన ఇంటివద్ద చిన్నగా తూలడంతో ప్రైవేటు ఆసుపత్రిలో ప్రాథమిక చేయించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం అనంతపురం తీసుకెళ్తుండగా మార్గమధ్యలోనే ప్రతి శ్వాస విడిచారు. 20 ఏళ్లుగా జర్నలిస్ట్ వృత్తిలో కొనసాగుతున్న పురుషోత్తం మృతి పట్ల ఏపీయూడబ్ల్యూజే తాలూకా కార్యవర్గం సంతాపం ప్రకటించింది. జర్నలిస్ట్ మృతి పట్ల ఎమ్మెల్యే సురేంద్రబాబు, టిడిపి నాయకులు నివాళి అర్పించారు. ఆయన కుటుంబాన్ని ప్రభుత్వం ద్వారా ఆదుకుంటామని భరోసా ఇచ్చారు. పురుషోత్తమకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. కుమారుడు విజయవాడలో ఇంటర్ సెకండియర్ చదువుతుండగా కూతురు స్థానికంగా చదువుకుంటోంది.

రెవెన్యూ ఎంప్లాయిస్ స్పోర్ట్స్, కల్చరల్ అసోసియేషన్ ప్రెసిడెంట్‌గా గౌని సంజీవరెడ్డి

విశాలాంధ్ర-అనంతపురం: అనంతపురం కృష్ణ కళామందిర్‌లో ఆదివారం జిల్లా రెవెన్యూ ఎంప్లాయిస్ స్పోర్ట్స్ , కల్చరల్ అసోసియేషన్ ఎన్నికలను నిర్వహించారు. ఈ ఎన్నికలలో రెవెన్యూ ఎంప్లాయిస్ స్పోర్ట్స్, కల్చరల్ అసోసియేషన్ ప్రెసిడెంట్‌గా గౌని సంజీవరెడ్డి, సెక్రటరీగా పుట్లూరు హరిప్రసాద్ రెడ్డి, ట్రెజరర్ గా కే.శ్రీనివాసమూర్తి, వైస్ ప్రెసిడెంట్ లుగా టీ.హరిప్రసాద్, ఎస్.చంద్రరేఖ, పి.మూర్తి ప్రసాద్ రెడ్డి, జాయింట్ సెక్రెటరీలుగా పి.నారాయణస్వామి, ఎస్.షాహిద్ అక్రమ్, డి.భరత్ ఎన్నికలలో పోటీ చేయగా, సభ్యులంతా ఏకగ్రీవంగా ఎన్నిక కావడం జరిగింది. ఏకగ్రీవంగా ఎన్నికైన రెవెన్యూ ఎంప్లాయిస్ స్పోర్ట్స్, కల్చరల్ అసోసియేషన్ ప్రెసిడెంట్, సెక్రటరీ, ట్రెజరర్, వైస్ ప్రెసిడెంట్‌లు, జాయింట్ సెక్రెటరీలను డిఆర్ఓ ఏ.మాలోల, ఆర్డీఓ కేశవ నాయుడు, తదితరులు అభినందించారు. జిల్లా రెవెన్యూ ఎంప్లాయిస్ స్పోర్ట్స్, కల్చరల్ అసోసియేషన్ అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు.

నేటి నుంచి గ్రామాల్లో పశువైద్య శిబిరాలు

విశాలాంధ్ర-అనంతపురం క్రైం: బుక్కరాయ సముద్రం మండలంలో ఉన్న గ్రామాల్లో సోమవారం నుంచి ఈనెల 31 తేదీ వరకు పశు వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నట్లు ప్రాంతీయ పశు వైద్యశాల సహాయ సంచాలకులు ఏవి రత్నకుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. పశువులకు దూడలకు ,గొర్రెలకు,మేకలకు నట్టల నివారణ మందులు ఇస్తామన్నారు. గ్రామాల్లో సర్పంచ్‌లు, ఎంపీటీసీ, జడ్పీటీసీ,ప్రజా ప్రతినిధులు రైతులు నాయకులు పాల్గొనాలని కోరారు. 20వ తేదీ పి. చదుళ్ల, దయ్యాల కుంటపల్లి, 21న కె. చదుళ్ళ, ఏదావులపర్తి, 22 న పొదరాళ్ళ, దండు వారిపల్లి, 23న ఆర్.కొత్తూరు, వెంకటాపురం, 24న బి.కొత్తపల్లి, కెకె అగ్రహారం, 25 న భద్రంపల్లి సంజీవపురం, 26న కొర్రపాడు బుక్కరాయ సముద్రం 27న రెడ్డిపల్లి, నీలారెడ్డిపల్లి, 28న రోటరిపురం బొమ్మలాటపల్లి, 29న అమ్మవారిపేట చెన్నంపల్లి, 30న గోవిందంపల్లి, సిద్ధరాం పురం, 31న జంతులూరు, పసులూరులో శిబిరాలు నిర్వహిస్తామన్నారు..

యోగివేమన మన రాష్ట్రంలో పుట్టడం భాగ్యంగా భావించాలి

- వేమన పద్యాలు ఆణిముత్యాలు..
- కలెక్టర్ వినోద్ కుమార్.వి

విశాలాంధ్ర-అనంతపురం : యోగివేమన మన రాష్ట్రంలో పుట్టడం, వారి మాటలు, పద్యాలు వింటూ పెరగడం భాగ్యంగా భావించాలని కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ పేర్కొన్నారు. అనంతపురం కలెక్టరేట్ లోని మినీ కాన్ఫరెన్స్ హాల్లో ఆదివారం జిల్లా పర్యాటక శాఖ ఆధ్వర్యంలో ప్రజాకవి, సంఘసంస్కర్త యోగివేమన జయంతి సందర్భంగా జాయింట్ కలెక్టర్ శివ్ నారాయణ శర్మతో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ యోగి వేమన పద్యాలు, మాటలు చేతిరాతతో కాకుండా ప్రజల నోటి మాటలతో ఒకరి ద్వారా ఇంకొకరికి చిరకాలం గుర్తుండి పోయేలా చేశారన్నారు. మధ్యయుగంలో యోగివేమన లాంటి కవులు సులభమైన వాడుక భాషలో, పల్లె పల్లెలలో ఉపయోగపడే విధంగా విప్లవం తెచ్చారన్నారు. అలాంటి యోగివేమన మన రాష్ట్రంలో పుట్టడం, వారి మాటలు, పద్యాలు వింటూ పెరగడం భాగ్యంగా భావిస్తామన్నారు. అలాగే ఉమ్మడి అనంతపురం జిల్లాలో వారి సమాధి గర్వకారణమని తెలిపారు. 500 సంవత్సరాల పద్యాలు ఇప్పటికీ వాడుకలో ఉన్నాయని, కలెక్టరేట్‌లో దాదాపు 500 పుస్తకాలు పురాతన చరిత్ర, ఇతిహాసాలతో విషయాలు ఉన్నాయని, ఈ పుస్తకాలకు నెంబర్లు వేసి లైబ్రరి తయారుచేసి మన సంస్కృతి, మన భాషను చాటాలన్నారు. కవులు ఏలూరు యంకన్న యోగి వేమన చెప్పిన పద్యాలు, ఉపన్యాసం అందరినీ ఆకట్టు కున్నాయి. కార్యక్రమంలో డిఆర్ఓ ఏ.మలోల, కలెక్టర్ కార్యాలయం ఏఓ అలెగ్జాండర్, జిల్లా టూరిజం అధికారి జయ కుమార్ బాబు, సమాచార పౌర సంబంధాల శాఖ అధికారి గురుస్వామి శెట్టి, కలెక్టరేట్ కోఆర్డినేషన్ సెక్షన్ సూపరింటెండెంట్ యుగేశ్వరి దేవి, మెజిస్టీరియల్ విభాగం సూపరింటెండెంట్ వసంతలత, భారత జాతీయ సంస్కృతి సాంప్రదాయాల పరిరక్షణ సంస్థ సభ్యులు, కవులు ఏలూరు యంకన్న, శ్రీనివాసరెడ్డి, మధుర శ్రీ, కృష్ణమూర్తి, అప్ప స్వామి, రామ్మోహన్‌రెడ్డి, రియాజుద్దీన్, కమ్మదూర్ నబి రసూల్, నాగభూషణం పాల్గొన్నారు.

గుత్తిలో యోగివేమన జయంతి

విశాలాంధ్ర-గుత్తి: పట్టణం వివేకానంద పాఠశాలలో ఆదివారం గుత్తి యోగి వేమన కమిటీ ఆధ్వర్యంలో యోగి వేమన జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. అనంతరం వేమన చిత్రపటానికి పూలమాలవేసి సత్కరించారు. వేమన కమిటీ గౌరవ అధ్యక్షులు లాయర్ జయరామిరెడ్డి, వేమన కమిటీ సలహాదారులు వెంకట్రాంరెడ్డి, మాట్లాడుతూ విశ్వదాభిరామ వినురవేమ అనే మకుటంతో వేమన రాసిన తెలుగు పద్యాలు ప్రపంచానికి జ్ఞాన జ్యోతిని వెలిగించిన లోక కవి వేమన అని కొనియాడారు. గుత్తి పట్టణంలో త్వరలో వేమన విగ్రహాన్ని ఏర్పాటు చేసేందుకు కమిటీ కృషి చేస్తుందన్నారు.అలాగే ప్రభుత్వం వేమన జయంతిని ప్రభుత్వ పండగగా జరపాలని, ప్రభుత్వ సెలవుదినంగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వేమన కమిటీ గౌరవ అధ్యక్షులు లాయర్ జయరాం రెడ్డి, వేమన కమిటీ గౌరవ సలహాదారులు పి.వెంకటరామిరెడ్డి, వేమన కమిటీ సభ్యులు వై సుభాష్ రెడ్డి,గుత్తి కోట సంరక్షణ సమితి వ్యవస్థాపక అధ్యక్షులు విజయభాస్కర్,గుత్తి కోట సంరక్షణ సమితి కార్యదర్శి వై.రాజశేఖర్‌రెడ్డి, అంబేద్కర్ ప్రీతిపాత్రుడు, జనసేన నాయకులు చిన్న వెంకటేశులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్యను పరిష్కరించిన టీడీపీ నాయకులు

విశాలాంధ్ర-యాడికి: పట్టణంలోని రజక వీధి, కొండ కింద వీధులలో తాగునీటి సమస్య ఉండడంతో ఆదివారం తాడిపత్రి ఎమ్మెల్యే జేసీ అస్మిత్ రెడ్డి ఆదేశాల మేరకు టిడిపి మండల కన్వీనర్ గొర్తి రుద్రమ నాయుడు స్పందించి బోరు వద్ద నుండి పైపులైన్ ఏర్పాటుచేసి కొళాయిలకు ఏర్పాటు చేయడంతో తాగునీటి సమస్య తీరింది. దీంతో కాలనీవాసులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో తొగట వీర క్షత్రియ రాష్ట్ర యువజన కార్యదర్శి తాండ్రవిక్రమ్, తెలుగు యువత నాయకులు కోడూరు నీలకంఠారెడ్డి పామిశెట్టి గోపి, వెంకటేష్, బాలు, మహమ్మద్, హాజీ భాష, వెంకటాద్రి, ఫిరోజ్, చందు, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు భద్రత నియమాలు ప్రతి ఒక్కరూ పాటించాలి

విశాలాంధ్ర-అనంతపురం క్రైం : రోడ్డు భద్ర నియమాలు పాటించడం వల్ల ప్రమాదాల నుంచి ప్రతి ఒక్కరు బయటపడవచ్చని బుక్కరాయసముద్రం సీఐ కరుణాకర్ తెలిపారు. ఆదివారం మండల పరిధిలోని చెరువు కట్ట వద్ద బుక్కరాయ సముద్రం సర్కిల్ పరిధిలోని పోలీసులు రోడ్డు భద్ర నియమాలపై అవగాహన కల్పిస్తూ వాహనాలను తనిఖీ చేశారు. ఎస్పీ జగదీష్ ఆదేశాల మేరకు బుక్కరాయ సముద్రం మండల వ్యాప్తంగా ఉన్న అన్ని సర్కిల్లో రోడ్డు భద్రత నియమాలపై అవగాహన కల్పిస్తున్నామన్నారు. వాహనదారులు ప్రతి ఒక్కరూ సీట్ బెల్టు ధరించాలన్నారు. సీటు బెల్ట్‌లు, హెల్మెట్లు ధరించకుండా డ్రైవింగ్ చేస్తున్న వారి నుంచి అపరాధ రుసుము వసూలు చేశారు. ఈ కార్యక్రమంలో వెహికల్ ఇన్‌స్పెక్టర్ లహరి, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

శింగనమల స్మశానవాటికలో కంపచెట్ల తొలగింపు

విశాలాంధ్ర-శింగనమల: మండల కేంద్రంలోని గొల్లకొండ కింద ఉన్న స్మశాన వాటికలో ఆదివారం తెలుగుదేశం పార్టీ నాయకులు కంపచెట్లను తొలగించారు. ఇటీవల మండల కేంద్రంలో గ్రామ రెవెన్యూ సదస్సులు, శింగనమల ఎమ్మెల్యే బండారు శ్రావణి, కలెక్టర్ నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో పలువురు అర్జీలు అందజేశారు. స్మశాన వాటిక పరిరక్షణకై ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ ఆదేశాల మేరకు స్మశాన వాటికలో జెసిబి సహాయంతో కంపచెట్లు తొలగించారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ నాయి బ్రాహ్మణ సంక్షేమ అభివృద్ధి కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ ఎం.ఆదినారాయణ, తెలుగు యువత శింగనమల మండల అధ్యక్షులు కాయల సురేష్ యాదవ్,మిట్టాపవన్, శంకర్ గౌడ్, ఐటిడిపి చాంపియన్ ముని, కాయల శివశంకర్, తదితరులు పాల్గొన్నారు.

అంబేద్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన అమిత్ షా రాజీనామా చేయాలి

సిపిఐ, కాంగ్రెస్ నిరసన

విశాలాంధ్ర-ఉరవకొండ : భారత పార్లమెంటు సాక్షిగా రాజ్యాంగ నిర్మాత బాబాసాహెబ్ అంబేద్కర్ ను అవమానించిన కేంద్ర హోం మంత్రి అమిత్ షా తక్షణం తన పదవికి రాజీనామా చేసి దేశ ప్రజలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేస్తూ ఆదివారం ఉరవకొండలో అంబేద్కర్ విగ్రహం వద్ద సిపిఐ, కాంగ్రెస్ పార్టీ నాయకులు నిరసన చేపట్టారు. సిపిఐ పార్టీ నియోజక వర్గ కార్యదర్శి మల్లికార్జున, కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి సోనియా శీనా, పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు బ్యాళ్ల ప్రసాద్ మాట్లాడుతూ అంబేద్కర్? పేరును అనేకసార్లు సంబోధించాల్సిన అవసరం లేదని, దానికి బదులు దేవుడిని తలుచుకుంటే స్వర్గం ప్రాప్తి లభిస్తుందని కించపరిచే విధంగా మాట్లాడిన అమిత్ షాను దేశం క్షమించదని అన్నారు. ఆర్ఎస్ఎస్ మతోన్మాదశక్తి దేశంలో బీజేపీని నడిపిస్తున్నదని, రాజ్యాంగం స్థానంలో మనుధర్మ శాస్త్రాన్ని తీసుకురావాలని ప్రయత్నం చేస్తుందని వారు దుయ్యబట్టారు. బడుగు, బలహీన వర్గాలు ఆరాదించే దైవం భారత రాజ్యాంగ నిర్మాతను అవమానించడం దారుణమైన చర్యని అన్నారు. అమిత్ షా రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిపిఐ పార్టీ వజ్రకరూరు కార్యదర్శి సుల్తాన్, కనేకల్ కార్యదర్శి గౌస్, పార్టీ సీనియర్ నాయకులు పురిడి తిప్పయ్య, గన్నే మల్లేష్, కాంగ్రెస్ పార్టీ నాయకులు అబ్బాస్, కుదాల రమేష్, వీరితోపాటు తోపుదు బండ్లు కార్మిక సంఘం నాయకులు చెన్నా రాయుడు, గంగాధర్, కూరగాయల వ్యాపార సంఘం నాయకులు అయ్యప్ప రెడ్డి, శాంతి మహిళలు పాల్గొన్నారు.

మోడల్ డీఎస్సి పరీక్షకు అనూహ్య స్పందన

విశాలాంధ్ర-కళ్యాణదుర్గం టౌన్: మోడల్ డీఎస్సీ పరీక్ష ద్వారా అభ్యర్థులకు అవగాహన కల్పించడమే లక్ష్యమని ఇన్ఫినిటీ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ బద్దే నాయక్ పేర్కొన్నారు. ఆదివారం ఇన్ఫినిటీ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో కరణం చెక్క ప్రభుత్వ పాఠశాలలో నిర్వహించిన మోడల్ డీఎస్సి పరీక్షకు వేలాది మంది అభ్యర్థులు హాజరై పరీక్ష రాయడం సంతోషకరమన్నారు. ముందుగా మోడల్ డీఎస్సీ పరీక్షను ఎమ్మెల్యే అమిలినేని సురేంద్ర బాబు, ఇన్ఫినిటీ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ బద్దే నాయక్‌తో కలిసి పరిశీలించారు. కళ్యాణదుర్గం నియోజక వర్గం ఇన్ఫినిటీ చారిటబుల్ ట్రస్ట్ చేస్తున్న సేవలను ప్రశంసించారు. చాలామంది పరీక్షల సమయంలో టెన్షన్ పడుతూ మార్కులు కోల్పోయి బాధపడే వారిని ఇలాంటి మోడల్ పరీక్షలు ద్వారా మార్కులు సాధించేందుకు అవకాశం ఉంటుందని తెలిపారు. మోడల్ డీఎస్సీ నిర్వహించడంపై ఆనందాన్ని వ్యక్తం చేస్తూ... కళ్యాణదుర్గం నియోజకవర్గానికి సేవా భావం కలిగిన ఇన్ఫినిటీ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ బద్దే నాయక్ దొరకడం అందరి అదృష్టం అన్నారు. ప్రతిభ కనబరిచిన వారికి బహుమతులు అందజేయనున్నారు.

కార్మికులపై అధికారుల వేధింపులు ఆపాలి

విశాలాంధ్ర-తాడిపత్రి: మున్సిపల్ కార్మికులపై అధికారుల వేధింపులు ఆపాలని ఏపీ మున్సిపల్ ఉద్యోగ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు నాగభూషణం అధికారులను డిమాండ్ చేశారు. ఆదివారం అనంతపురం కలెక్టర్ లోని సిడిఎంఏ పరిశీలనకు వచ్చిన సందర్భంగా కలెక్టర్ గెస్ట్ హౌస్ వద్ద తాడిపత్రి మున్సిపల్ కార్మికుల సమస్యలపై ఏపీ మున్సిపల్ ఉద్యోగ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు నాగభూషణం తాడిపత్రి ఇంజనీరింగ్ విభాగం నాయకులు సిఐటియు నాయకులు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాగభూషణం మాట్లాడుతూ అధికారుల వేధింపులు ఆపాలని, కార్మికులు గత 15 సంవత్సరాలుగా ఇంజనీర్ సెక్షన్లో పనిచేస్తున్న కార్మికులను తీవ్రంగా వేధిస్తూ కార్మికుల మనోభావాలను దెబ్బతీస్తున్నార న్నారు. కార్మికులు చేస్తున్న పనుల వల్లే మున్సిపల్ ఆఫీస్ కి పేరు వస్తుందని, అటువంటి కార్మికులను ఇబ్బందులకు గురి చేస్తూ వారు చేస్తున్న పనులపై మార్పులు చేర్పులు చేస్తున్నారన్నారు. ఈ విషయం కమిషనర్ దృష్టికి తీసుకుపోయిన ఫలితం లేకపోవడంతో మీ దృష్టికి తీసుకు వస్తున్నామని ఏఈ సన్నీ తేజపై తక్షణం చర్యలు తీసుకొని కార్మికులకు న్యాయం చేయాలని తెలియజేశారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు రామాంజనేయులు, ఉమాగౌడ్ మున్సిపల్ ఇంజనీరింగ్ విభాగం కార్మికులు పాల్గొన్నారు.

శాంతి భద్రతలకు విఘాతం కలిగించవద్దు

- రౌడీషీటర్లకు తాడిపత్రి రూరల్ సీఐ శివగంగాధర్ రెడ్డి హెచ్చరిక

విశాలాంధ్ర-తాడిపత్రి: శాంతి భద్రతలకు విఘాతం కలిగించద్దండని రూరల్ సీఐ శివగంగాధర్ రెడ్డి రౌడీ షీటర్లకు హెచ్చరించారు. ఆదివారం రూరల్ పోలీస్ స్టేషన్లో మండలంలోని సజ్జలదిన్నె, ఆలూరు, వెలమకూరు, బ్రాహ్మణపల్లి, ఇగుడూరు, కావేరి సముద్రం తదితర గ్రామాలలో ఉన్న రౌడీ షీటర్లకు, హత్య కేసులో ఉన్న నిందితులకు రూరల్ సీఐ శివగంగాధర్ రెడ్డి కౌన్సిలింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాలలో ఎవరితో కానీ చిన్నచిన్న తగాదాలకు వెళ్లొద్దన్నారు. ఏవైనా సమస్యలు వచ్చినప్పుడు పోలీస్ స్టేషన్ కు వచ్చి ఫిర్యాదు చేయాలన్నారు.

గ్రామాలలో శాంతియుతానికి భగ్నం కలిగిస్తే కఠిన చర్యలు తప్పని హెచ్చరించారు. కావున ప్రతి ఒక్కరు గొడవలకు వెళ్లకుండా శాంతియుతంగా జీవితం కొనసాగిస్తూ ఆనందంగా జీవించాలని సూచించారు.

అంబిగర చౌడయ్య జయంతి వేడుకలు

విశాలాంధ్ర-కణేకల్లు: మండల కేంద్రంలో బెస్త కులస్థులు ఆధ్వర్యంలో అంబికార చౌడయ్య జయంతి వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలు లో ప్రభుత్వ విప్ రాయదుర్గం శాసనసభ్యులు రాయదుర్గం శాసనసభ్యులు కాలువ శ్రీనివాసులు పాల్గొన్నారు. అంబిగర చౌడయ్య చిత్రపటాన్ని రథంపై ప్రత్యేకంగా అలంకరించి పట్టణ పురవీధుల గుండా ఊరేగించారు. వందలాది మంది మహిళలు హారతులు పట్టారు. ఎమ్మెల్యే కాల్వ శ్రీనివాసులను గజమాలతో బెస్త కులస్తులు సన్మానించారు.

నాగేపల్లి ఊరు దేవర జాతరకు మెట్టు గోవిందరెడ్డికి ఆహ్వానం

విశాలాంధ్ర-కణేకల్లు: నాగేపల్లి ఊరు దేవర జాతరకు రాయదుర్గం వైసీపీ పార్టీ కార్యకర్త మెట్టు గోవింద్ రెడ్డికి నాగేపల్లి గ్రామ వైసీపీ పార్టీ కుటుంబ సభ్యులు కార్యకర్తలు ఆహ్వానం పలికారు. 21న. మంగళవారం జరుగు, నాగేపల్లి కొల్లాపూరమ్మ, దేవమ్మ దేవి, ఊరు దేవర జాతరకు రావాలని కోరుతూ ఆహ్వానపత్రికను అందజేశారు.

నేడు రాప్తాడులో ప్రజా సమస్యల పరిష్కార వేదిక

విశాలాంధ్ర-రాప్తాడు: మండల కేంద్రంలోని తహశీల్దార్ కార్యాలయంలో నేడు ప్రజా సమస్యల పరిష్కార వేదిక యథావిధిగా నిర్వహించనున్నట్లు తహశీల్దార్ పి.విజయకుమారి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అయితే ఎస్సీల ఉప వర్గీకరణ రాజీవ్ రంజాన్ మిశ్రా నేతృత్వంలోని ఏక సభ్య కమిషన్ పర్యటన ఉన్నందున జిల్లా కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించనున్న ప్రజా సమస్యల పరిష్కార వేదికను రద్దు చేసినట్లు తెలిపారు.

3,4న రథసప్తమి వేడుకలు

పోస్టర్ల విడుదల చేసిన ఆలయ కమిటీ సభ్యులు

విశాలాంధ్ర-ఉరవకొండ: అనంతపురం జిల్లా ఉరవకొండ మండలం బూదగవి గ్రామంలో వెలిసిన ప్రసిద్ధ పుణ్యక్షేత్రం సూర్యనారాయణ స్వామి దేవాలయంలో జరిగే రథసప్తమికి సంబంధించిన పోస్టర్లను ఆదివారం ఆలయ ఆవరణలో ఆలయ కమిటీ సభ్యులు విడుదల చేశారు. ఆలయ కమిటీ చైర్మన్ చిత్రగుడి చిరంజీవి మాట్లాడుతూ ఫిబ్రవరి 3, 4 తేదీలలో రథసప్తమి వేడుకలు అత్యంత వైభవంగా జరగనున్నాయని తెలిపారు. ఫిబ్రవరి 4 మంగళవారం రథసప్తమి పురస్కరించుకొని ఆలయంలో ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. ఆంధ్ర, కర్ణాటక రాష్ట్రాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు సూర్యనారాయణ స్వామి దర్శనానికి వస్తున్నట్లు తెలిపారు. రథసప్తమి రోజు పెద్ద సంఖ్యలో భక్తులు హాజరై స్వామివారిని దర్శించుకోవాలని వారు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు మహేంద్ర గౌడ్, సుధాకర్, కృష్ణ మోహన్, మాజీ ఎంపీటీసీ రామస్వామి పాల్గొన్నారు.

పశువైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోండి

నేటి నుంచి గ్రామాల్లో 31వ తేదీ వరకు వైద్య సేవలు

విశాలాంధ్ర-బొమ్మనహాల్: మండలంలోని వివిధ గ్రామాల్లో ఈనెల 20వ తేదీ సోమవారం నుండి 31వ తేదీ వరకు ప్రతి గ్రామంలో ఉచిత పశు ఆరోగ్య శిబిరాలు నిర్వహిస్తున్నట్లు బొమ్మ నహాల్ మండల పశు వైద్యాధికారి వెంకట్ రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. పశువుల వ్యాధుల నియంత్రణకు టీకాలు, పశుపోషణ ఖర్చులు తగ్గించేందుకు అవగాహన కార్యక్ర మాలు జరుగుతాయన్నారు పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

విశాలాంధ్ర-శెట్టూరు: శెట్టూరు కుందుర్పి మండలంలో ఉన్న గ్రామాల్లో పశు వైద్య శిబి రాలు నిర్వహించనున్నట్లు ఏడీ నాగలింగేశ్వర్ రెడ్డి, డాక్టర్ ప్రసాద్, ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు ప్రజా ప్రతినిధులు ఆధ్వర్యంలో నేటి ఈనెల 31 తేదీ వరకు పశువులకు దూడలకు గొర్రెలకు మేకలకు నట్టల నివారణ మందులు ఇస్తామన్నారు. నట్టల నివారణ మందులు త్రాపించడం వలన పశువుల పొట్టలోని ఎలిక పాములు ,జలగలు నశించి పశువులకు వ్యాధి నిరోధక శక్తి పెరిగి అన్ని పశువులు ఆరోగ్యంగా ఉంటాయియని తెలిపారు.

గార్లదిన్నె మండలంలో..

విశాలాంధ్ర-గార్లదిన్నె : మండలంలోని ఆయా గ్రామాల్లో పశు వైద్య శిబిరాలు నిర్వహిం చనున్నారు. ముఖ్యంగా గర్భకోశ వ్యాధులు ఉన్న పశువులకు చికిత్సలు, నట్టల నివారణ మందులను తాపడం జరుగుతుంది. 31వ తేదీ వరకు ప్రతిరోజు రెండు గ్రామాలలో శిబిరాలు ఉంటాయి.

గార్లదిన్నె టీమ్, ఎర్రగుంట్ల టీమ్‌షెడ్యూల్....

20న గార్లదిన్నె -1, ముకుందపురం, 21న కనంపల్లి, పెనకచెర్ల, 22న గుద్దలపల్లి, పి. కొత్తపల్లి, 23న గుద్దలపల్లి సిరివరం , కొప్పాలకొండ, 24న కల్లూరు-1, కేశవాపురం 25న కల్లూరు-2, కేశవాపురం, 26, 27న. ఇల్లూరు, కె.కొట్టాలపల్లి, 28న మర్తాడు, కృష్ణాపురం, 29న కోటంకా, బుదేడు, 30న గార్లదిన్నె-2, సంజీవపురం, 31న యరగుంట్ల, కావున పాడి రైతులు, ప్రజాప్రతినిధులు ఈ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని డాక్టర్ ఎస్ రమేష్ (గార్లదిన్నె) , డాక్టర్ ఆంజనేయులు నాయక్(యరగుంట్లా) పశు వైద్య కేంద్రం వారు తెలిపారు.

విశాలాంధ్ర శ్రీ సత్యసాయి
www.visalaandhra.com
కర్నూలు, సోమవారం 20, జనవరి 2025

పుట్టపర్తిలో భూ బకాసురులు..

- మాయమవుతున్న రాళ్లగుట్టలు, ఇరిగేషన్ భూములు
- బడాబాబులకు కొమ్ముకాస్తున్న అధికారులు
- పేదలకు ఒకలా.. పెద్దలకు మరో న్యాయమా

కంచే చేను మేసిందన్న చందంగా మారింది రెవెన్యూ అధికారుల తీరు. పుట్టపర్తి జిల్లా కేంద్రమైన తర్వాత ఈ భూ బకాసురుల దోపిడీ ఎక్కువైపోయింది.. ప్రభుత్వ భూములను కాపాడాల్సి వారే ముడుపులకు ఆశపడి తిమ్మిని బమ్మి చేస్తున్నారు. కోట్లాది రూపాయల విలువైన భూముల రికార్డులు మార్చేసి అయినవారికి కట్టబెట్టేస్తున్నారు. సెంటు జాగా ఇస్తే గూడు నిర్మించుకుంటామని ఏళ్ల తరబడి నిరీక్షిస్తున్న నిరుపేదలను కనికరించని రెవిన్యూ అధికారులు.. కోట్లాది రూపాయల విలువ చేసే ప్రభుత్వ భూములను పెద్దలకు అప్పనంగా దారాదత్తం చేస్తున్నారు. మరోవైపు నిరు పేదలు ఇరిగేషన్ స్థలాల్లో పొట్టుపోసుకునేందుకు చిన్న దుకాణాలు ఏర్పాటు చేసుకుంటే కనికరం లేకుండా తొలగించేందుకు సిద్ధమవ్వడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

– విశాలాంధ్ర-పుట్టపర్తి

అధికారులు అనుకున్నదే తడవుగా రికార్డుల్లో ప్రభుత్వ భూములను మార్పులు చేసేసి అనుకున్న వారికి కట్టబెట్టేస్తున్నారు. పుట్టపర్తి మున్సిపల్ పరిధిలో కోట్లు విలువ చేసే భూమిని ఓ ప్రైవేట్ విద్యాసంస్థ అధినేత పేరిట 1బి చేయించడం చర్చనీయాంశంగా మారింది. పేదలు కాళ్లరిగేలా తిరిగినా కనికరించని అధికారులు విద్యాసంస్థ అధినేత పేరిట దాదాపు 2.45 ఎకరాలు 1బి చేయడానికి ఎక్కడ నుంచి వచ్చింది? అంటూ ప్రజా సంఘాల నాయకులు ప్రశ్నిస్తున్నారు. అదేవిధంగా ఎనుములపల్లిలోని శిల్పారామం నుంచి ఆంజనేయ స్వామి దేవాలయం వరకు 64 సెంట్లు ఉండవలసిన ఇరిగేషన్ భూమి కూడా కొందరు పెద్దల చేతుల్లోకి వెళ్లిపోయింది. ఇప్పుడు ఒక్క సెంటు కూడా కనిపించడం లేదు. ఇరిగేషన్ భూములు పుట్టపర్తి మున్సిపల్ పరిధిలో ఎక్కడికక్కడ ఆక్రమణకు గురవుతున్నా అడ్డుకునే నాథుడు లేదు. ఇరిగేషన్ అధికారులు భూ బకాసురులను వదిలి ప్రభుత్వ ఇరిగేషన్ భూముల్లో చిన్నచిన్న బంకులు ఏర్పాటు చేసుకుని పొట్ట నింపుకుంటున్న పేదలను మాత్రం అక్కడ నుంచి ఖాళీ చేయించేందుకు ముప్పు తిప్పలు పెడుతున్నారు. కలెక్టర్ స్పందించి అన్యాక్రాంతమవుతున్న ప్రభుత్వ భూములను కాపాడాలని పలువురు కోరుతున్నారు.

పొట్టకొట్టొద్దు సారూ..

రవి, హోటల్ యజమాని, పుట్టపర్తి

పదేళ్ల నుంచి ఇరిగేషన్ భూమిలో చిన్న హోటల్ పెట్టుకొని జీవిస్తున్నా. హోటల్లో నేను నా భార్య రోజంతా పనిచేస్తేనే దినకూలి గిట్టుబాటు అవుతుంది. ఇప్పుడు ఉన్నట్టుండి మున్సిపల్ అధికారులు హోటల్ తొలగించాలని చెప్పడంతో రోడ్డున పడాల్సిన దుస్థితి.. అధికారులు మాపై దయ ఉంచి హోటల్ ఖాళీ చేయకుండా చేయండి.

జీవనాధారం తొలగించొద్దు..

నాగమణి, టీ స్టాల్ నిర్వాహకులు,

నేను 5 సంవత్సరాల నుంచి హోటల్ నడుపుకుంటున్నాను. మా పిల్లలను ఈ హోటల్ ద్వారానే పోషించుకుంటున్నా.. ఇప్పుడు ఉన్నట్టుండి ఇరిగేషన్ భూమిలో హోటల్ ఖాళీ చేయాలని మున్సిపల్ అధికారులు నోటీసులు జారీ చేయడం దారుణం. కలెక్టర్ స్పందించి మా కుటుంబాన్ని ఆదుకోవాలి.

అమిత్ షా వెంటనే రాజీనామా చేయాలి..

- అంబేద్కర్‌ను అవమానించడం తగదు
- దేశ ప్రజలకు క్షమాపణలు చెప్పాలి
- వామపక్షాల డిమాండ్ ..

విశాలాంధ్ర-ధర్మవరం: పార్లమెంటు సాక్షిగా అంబేద్కర్ గురించి అనుచిత వ్యాఖ్యలు చేసిన హోం మంత్రి అమిత్ షా వెంటనే రాజీనామా చేయాలని, దేశ ప్రజలకు తప్పనిసరిగా క్షమాపణలు చెప్పాలని వామపక్ష నాయకులు డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక కళాజ్యోతి సర్కిల్‌లో వామపక్షాల ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. సిపిఐ ఏఐటీయూసీ, ఎర్రంశెట్టి రమణ, ఏపీ చేనేత కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి వెంకట్ నారాయణ, సిపిఎం జిల్లా నాయకులు ఎస్, హెచ్, భాష సిఐటియు నాయకులు జెవి. రమణ మాట్లాడుతూ బడుగు బలహీన వర్గ ప్రజలకు, కార్మికులకు హక్కులు కల్పించి దేశ సౌభ్రాతృత్వాన్ని, లౌకిక తత్వాన్ని, ప్రజలు స్వేచ్ఛ వాక్ స్వాతంత్రాలతో జీవించడానికి రాజ్యాంగబద్ధంగా హక్కులు కల్పించి భారత రాజ్యాంగాన్ని రచించిన అంబేద్కర్ గురించి దేశ హోం మంత్రి కించపరిచే విధంగా మాట్లాడడం చాలా బాధాకరంగా ఉన్నదని మండిపడ్డారు. రాజ్యాంగాన్ని సైతం మార్పులు చేయడానికి అనేక రకాల కుట్రలు అవకాశాలు చూస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. దేశ ప్రధాని సైతం హోంమంత్రికి తగిన విధంగా గుణపాఠం చెప్పాలని వామపక్ష నాయకులు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏపీ చేనేత కార్మిక సంఘం గౌరవ అధ్యక్షులు వెంకటస్వామి లక్ష్మీనారాయణ, సిఐటియు అయూబ్ రైతు సంఘం జిల్లా నాయకులు ఆలకుంట మారుతి, ఆదినారాయణ, కదిరప్ప సిపిఐ నాయకులు శ్రీధర్, గంగాధర్ ,ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు నాగార్జున, యువజన సంఘం జిల్లా అధ్యక్షులు సకల రాజా నాయకులు ఆదినారాయణ, నాయకులు పాల్గొన్నారు.

అమిత్ షా గోబ్యాక్

కదిరిలో వామపక్ష పార్టీల నిరసన

విశాలాంధ్ర-కదిరి: భారత రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ ను పార్లమెంటు సమావేశాల సందర్భంగా అవమానించిన కేంద్ర హోం మంత్రి అమిత్ షా రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ కదిరిలో వామపక్ష పార్టీలు నిరసన చేపట్టి దిష్టిబొమ్మ దగ్ధం చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా రాష్ట్ర పర్యటనను వ్యతిరేకిస్తూ గో బ్యాక్..గో బ్యాక్ అమిత్ షా అంటూ నినాదాలు చేస్తూ విశాఖ ఉక్కుకి రూ.11,440 కోట్ల రూపాయల ప్యాకేజీ ఇచ్చామని చెప్పిన ప్రభుత్వం ప్రైవేటీకరణ ఎత్తేస్తున్నామని ఒక ప్రకటన కూడాచేయకుండా రాష్ట్రానికి ప్రత్యేక ప్యాకేజీ ఇచ్చిందని ప్రజలను మభ్యపెడుతున్నారన్నారు. విశాఖ ఉక్కును ప్రభుత్వమే నిర్వహించాలని, విశాఖ స్టీల్ ప్లాంట్‌కి సొంత ఇనుప గనులు, బొగ్గు గనులు ప్రారంభించాలని డిమాండ్ ఈ కార్యక్రమంలో సీపీఐ పట్టణ కార్యదర్శి లియాకత్,పవన్ కుమార్, ఏఐటియుసి జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ మధు నాయక్, సీపీఎం నాయకులు జగన్మోహన్, రామ్మోహన్, బాబ్జాన్,ముస్తక్ పాల్గొన్నారు.

క్రీడలతోనే విద్యార్థులకు ఉల్లాసం

విశాలాంధ్ర-నల్లమాడ : క్రీడలతోనే విద్యార్థులకు మానసిక ఉల్లాసం, ఉత్సాహాన్ని కలిగిస్తాయని మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం మండలం కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించారు. ముఖ్య అతిథులుగా పల్లె రఘునాథ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటమి ప్రతి విజయానికి తొలిమెట్టు అన్నారు. చదువుతోపాటు విద్యార్థులు క్రీడల్లో రాణించాలని పేర్కొన్నారు. క్రికెట్ టోర్నమెంట్లో మొత్తం 36 జట్లు పాల్గొని ఫైనల్ లో కొత్త చెరువు మండలం నల్లమాడలం జట్టు తెలుపబడ్డాయి. నల్లమాడ జట్టు విజయం గెలుపొందగా విన్నర్ గా రూ.20116 లను ఆయన చేతుల మీదుగా అందజేశారు. రన్నర్‌గా నిలిచిన కొత్త చెరువు జట్టుకు రూ.10116 లను అందజేశారు. అత్యంత ప్రతిభ కనబరచిన క్రీడాకారులకు మెడల్స్, ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. క్రికెట్ టోర్నీ నిర్వాహకులు మంజునాథ్ రెడ్డి, అబ్బాస్, మైలె శంకర్‌ను పల్లె రఘునాథ్ రెడ్డి అభినందించారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి తోపాటు సీఐ నరేందర్ రెడ్డి, మండలం కన్వీనర్ శంకర్ మాజీ జెడ్పీటీసీ శ్రీనివాస్ రెడ్డి, రాష్ట్ర డైరెక్టర్ కాలే నాయక్ పాల్గొన్నారు.

పద్యాలు రచనలు ద్వారా సమాజాన్ని మేల్కొల్పిన వేమన

పెనుకొండలో..

ధర్మవరంలో..

రొళ్లలో..

విశాలాంధ్ర-పెనుకొండ: వేమన జయంతి సందర్భంగా పెనుకొండ పట్టణంలో టిడిపి కార్యాలయంలో ఆదివారం వేమన చిత్ర పటానికి పూలమాలలు వేసి టిడిపి నాయకులు మంత్రి సవితమ్మ భర్త వెంకటేశ్వరరావు, తెదేపా పట్టణ పార్టీ అధ్యక్షులు శ్రీరాములు నివాళులు అర్పించారు. నాయకులు శ్రీనివాసులు, బాబుల్ రెడ్డి, అరుణ్ రెడ్డి,బాబి రెడ్డి, రామకృష్ణారెడ్డి, ప్రసాద్, సుబ్రహ్మణ్యం, శరత్, చెంద్రాయుడు, మాధవరెడ్డి గోపాల్ సాయి రమేష్, చంద్ర పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ ఎప్పటికీ చెరిగిపోని పద్యాలు, తన రచనల ద్వారా సమాజాన్ని చైతన్య పరచిన అభ్యుదయవాది ప్రజాకవి, సంఘసంస్కర్త అన్నారు. పెనుకొండ సబ్ కలెక్టర్ కార్యాలయంలో సబ్ కలెక్టర్ ఆనంద్ కుమార్ ఆధ్వర్యంలో వేమన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. వేమన సమాజానికి చేసిన సేవ గురించి, తెలుగు భాషాభివృద్ధికి సరళమైన భాషలో పామరుడికి కూడా అందుబాటులోకి వచ్చే విధంగా సరళమైన పద్య రూపంలో తన కవిత్వాన్ని వెలబుచ్చిన మహానుభావుడని కొనియాడారు.

ఘనంగా యోగవేమన జయంతి

విశాలాంధ్ర-ధర్మవరం: పట్టణంలోని ఆర్డిఓ కార్యాలయంలో కార్యాలయ అధికారులు, సిబ్బంది, ఆర్డీవో మహేష్ ఆధ్వర్యంలో యోగివేమన జయంతి వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. వేమన చిత్రపటానికి పూలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఆర్డిఓ మాట్లాడుతూ యోగివేమన రాసిన ప్రతి పద్యము అందరికీ మంచి స్ఫూర్తినిస్తాయని తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో సాయి మనోహర్ ఆధ్వర్యంలో కార్యాలయ సిబ్బంది చిత్రపటానికి పూలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఎంపీడీవో మాట్లాడుతూ యోగివేమన 14వ శతాబ్దపు వారని, అసలు పేరు పెదకొమిటి చిన్న వేమారెడ్డి అని తెలిపారు. వీరు రచించిన పద్యాలు అందరికీ జీవిత మార్గదర్శకాలు అన్నారు. ఆనాటి వర్ణ, వర్గా, కుల, మత సామాజిక రుగ్మతులకు వ్యతిరేకంగా తన పద్యాలతో ప్రజలను చైతన్యం చేశారని కొనియాడారు. కదిరికి సమీపంలో కటారు పళ్ళులో వేమన మరణించారని, సమాధి కూడా అక్కడే ఇప్పటికీ ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏవో. అబ్దుల్ నబీ, కార్యదర్శులు, సీనియర్ అసిస్టెంట్ సుబ్రహ్మణ్యం, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

గొప్ప సంఘ సంస్కర్త యోగివేమన

విశాలాంధ్ర-రొళ్ల: తన పద్యాల ద్వారా సమాజాన్ని మేల్కొల్పిన గొప్ప సంఘసంస్కర్త యోగి వేమన అని తహసీల్దార్ షేక్షావలి పేర్కొన్నారు.ఆదివారం స్థానిక తహసిల్దార్ కార్యాలయంలో యోగివేమన జయంతి ఉత్సవాలు రెవిన్యూ సిబ్బంది ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. తన పద్యాల ద్వారా సమాజంలో ప్రజల్లో అనేక సంస్కరణలు తీసుకొచ్చారని తెలిపారు. కార్యక్రమంలో మండల రెవెన్యూ ఇన్స్పెక్టర్ గిరియప్ప, వీఆర్వోలు రంగనాథ్,వేణుగోపాల్ నరసింహమూర్తి, చిరంజీవి లక్ష్మీనారాయణ, నాగరాజు ధనలక్ష్మి, పాల్గొన్నారు...

విశాలాంధ్ర-హిందూపురం: పట్టణంలో ఆదివారం హిందూపురం రెడ్డి జేఏసీ ఆధ్వర్యంలో విశ్వకవి శ్రీ యోగి వేమన జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. రెడ్డి జేఏసీ ఆధ్వర్యంలో ఆర్అండ్‌బి బంగ్లా నుండి సడ్లపల్లి, ఆటో నగర్ క్రాస్ వరకూ బైక్ ర్యాలీ చేపట్టారు. వేమన సర్కిల్ వద్ద ఉన్న శ్రీ యోగి వేమన విగ్రహానికి గుడ్డంపల్లి వేణు రెడ్డి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం యోగి వేమన సమాజం కోసం చేసిన మంచిని స్మరించుకున్నారు. ఈ కార్యక్రమంలో రెడ్డి జేఏసీ వారు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

హిందూపూర్‌లో..

మునిమడుగు ఘటనపై 20 మందిపై కేసు నమోదు

- 11 మంది అరెస్టు రిమాండ్ తరలింపు
- మిగిలిన నిందితుల కోసం పోలీసుల గాలింపు చర్యలు

విశాలాంధ్ర-పెనుకొండ : పెనుకొండ మండలం మునిమడుగు గ్రామంలో ఓ మహిళ జుట్టును కత్తిరించిన సంఘటనపై బాధితురాలు ఫిర్యాదు మేరకు 20 మందిపై కేసు నమోదు చేసి ఇందులో 11 మందిని అరెస్టు చేసి రిమాండ్ కు తరలించడంతో పాటు మిగిలిన 9 మంది కోసం ప్రత్యేక పోలీస్ బృందాలను ఏర్పాటు చేసి గాలింపు చర్యలు చేపట్టినట్లు డీఎస్పీ వెంకటేశ్వర్లు, సిఐ రాఘవన్ వెల్లడించారు. ఈ సంఘటనపై వెంటనే దర్యాప్తు చేపట్టి ముద్దాయిలను అరెస్టు చేయాలని జిల్లా ఎస్పీ వి రత్న ఐపీఎస్ సీరియస్ గా తీసుకున్నారు.ప్రత్యేక బృందాలు ,పోలీసులు వెంటనే గాలింపు చర్యలు చేపట్టారు. మునిమడుగు గ్రామానికి చెందిన ఓ యువతి తప్పిపోయిందని తల్లిదండ్రులు ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు తక్షణమే ఈ కేసును సీరియస్గా తీసుకొని రెండు రోజుల వ్యవధిలోనే అమ్మాయిని పట్టుకొని తల్లిదండ్రులకు అప్పజెప్పారు. ఈ సంఘటనలో మైనర్ అమ్మాయిని మాయ మాటలు చెప్పి వెంట తీసుకెళ్లారని అమ్మాయి తల్లిదండ్రులు ఫిర్యాదు చేయడంతో ఆ యువకుడు పై ఫోక్సో కేసు నమోదు చేసి అరెస్టు చేయడం జరిగిందని డిఎస్పి తెలిపారు.అయితే ఈ జంట పారిపోవడానికి మహిళ కారణమని కేసులో ఎక్కడ ఆమెపై ఫిర్యాదు చేయలేదని ,కేవలం అనుమానంతో బాలిక కుటుంబ సభ్యులైన మహిళలు ఆమెపై దాడి చేసి జడ కత్తిరించారని, అయితే పెనుగులాటలో బట్టలు చిరిగిపోయాయి. ఈ సంఘటనపై బాధితురాలు ఫిర్యాదు చేయడంతో తక్షణమే సీఐతో పాటు మునిమడుగు గ్రామానికి వెళ్లి విచారణ చేపట్టడం జరిగిందన్నారు. ఈ దాడికి పాల్పడిన వారిపై కేసు నమోదు చేసినట్లు వెల్లడించారు. వెంకటలక్ష్మిపై దాడికి పాల్పడిన కేసులో 20 మందిపై కేసు నమోదు చేశామని, ఇప్పటికీ 11 మందిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామన్నారు. మిగిలిన 9 మంది కోసం ఇప్పటికే పోలీసులు ప్రత్యేక బృందాల చేత గాలింపు చర్యలు చేపట్టామని త్వరలోనే వారిని అరెస్ట్ చేస్తామని డిఎస్పి వెల్లడించారు. ఈ కార్యక్రమంలో కియా ఎస్ఐ రాజేష్ పాల్గొన్నారు.

వీరవనిత వణీకే ఓబవ్వ విగ్రహం ఏర్పాటు చేయిస్తా

ఎమ్మెల్యే ఎమ్మెస్ రాజు

విశాలాంధ్ర-గుడిబండ/అమరాపురం: మండలంలోని మందలపల్లి గ్రామంలో వణీకే ఓబవ్వ జయంతిని మాల సంఘం నాయకులు నిర్వహించారు ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే ఎమ్మెస్ రాజు, సి డబ్ల్యూ సి మెంబర్ రఘువీరారెడ్డి, రాష్ట్ర తెదేపా ఉపాధ్యక్షుడు గుండుమల తిప్పేస్వామి, మాజీ ఎమ్మెల్యే వైటీ ప్రభాకర్ రెడ్డి,రాష్ట్ర మాల కార్పొరేషన్ చైర్మన్ విజయ్ కుమార్,రోళ్ల జడ్పిటిసి సభ్యుడు అనంతరాజు,పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చిత్రదుర్గ కోట సామంతరాజుల రాజ్యాన్ని శత్రు సైన్యం నుండి కాపాడేందుకు వీరోచిత పోరాటాన్ని చేసిన వీరవనిత వణీకే ఓబవ్వ ధైర్యసాహసాలు కొనియాడ దిగినవని వణీకే ఓబవ్వ పోరాట పటిమ భావితరాలకు స్ఫూర్తిదాయకంగా ఉండేందుకు విగ్రహాన్ని ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ క్రమంలో సభలో ఎమ్మెల్యే ఎమ్మెస్ రాజు మాట్లాడుతూ పల్నాడు సైన్యాధ్యక్షుడు మాల వీర కన్నమదాసు, ఒబవ్వ వంటి పోరాట వీరుల చరిత్రను తెలియజేసేందుకు నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో ఒబవ్వ జయంతి కార్యక్రమాలు ఏర్పాటు చేయాలని నిర్వాహకులను కోరారు. అలాగే నియోజకవర్గంలోని ఏ దళిత కాలనీ సీసీ రోడ్లు లేకుండా మౌలిక సదుపాయాలు, మంచినీటి వ్యవస్థ, ఉండేలా చర్యలు తీసుకుంటానని భరోసా కల్పించారు. ఈ కార్యక్రమంలో మాల కార్పొరేషన్ చైర్మన్ విజయకుమార్, డైరెక్టర్ కమలమ్మ,మాల సంఘం తాలూకా అధ్యక్షులు పాండురంగప్ప, తెదేప మండల కన్వీనర్ మద్దనకుంటప్ప, దాసిరెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నాగరాజు, సర్పంచ్ లక్ష్మీనారాయణ, కాచికుంట వెంకటేష్ మందలపల్లి బసవరాజు, గుడిబండ మండల మాల సంఘం అధ్యక్షుడు మూర్తి పాల్గొన్నారు.

స్వచ్ఛంద సంస్థ నిర్వాహకులకు ఘన సన్మానం

విశాలాంధ్ర-ధర్మవరం: సామాజిక చైతన్య సంస్థ కడప వారి ఆధ్వర్యంలో నిర్వహించిన వైయస్సార్ ప్రెస్ క్లబ్లో జరిగిన జాతీయ సదస్సులో ధర్మవరం పట్టణానికి చెందిన స్వచ్ఛంద సేవా సంస్థ నిర్వాహకులు డాక్టర్ సత్య నిర్ధారణ, పోలా ప్రభాకర్లను ఘనంగా సన్మానించారు. డాక్టర్ సత్య నిర్ధారణ ఈ సదస్సు ఆర్గనైజింగ్ కార్యదర్శిగా సేవలను అందించారని ఎన్జీవో ద్వారా వృద్ధుల సామాజిక ఆరోగ్య ప్రణాళికలు రూపొందించి అమలు చేస్తున్నందున వీరి అపురూప సేవలను గుర్తించి సదస్సు చైర్మన్ నార్ల ప్రకాష్ ఈవెంట్ పార్ట్నర్ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు ఎస్వీ రాజు తదితర జాతీయ ప్రముఖుల ద్వారా సన్మానం చేసి జ్ఞాపకం అందజేశారు. ఇక పోలా ప్రభాకర్ ఇండియన్ రెడ్ క్రాస్, యువర్ ఫౌండేషన్ వారి ఆధ్వర్యంలో భవిష్యత్తులో భిన్నమైన అత్యంత ప్రయోజనమైన కార్యక్రమాలను చేపట్టడం జరిగిందని, వృద్ధుల జీవితాల గురించి తెలుసుకొని ఆదుకోవడం, మన బంధు కార్యక్రమాలకు రూపకల్పన చేయడం జరిగిందని తెలిపారు. జాతీయ సదస్సు చైర్మన్ నార్ల ప్రకాశం రాయలసీమ మనోబంధు కోఆర్డినేటర్ శివారెడ్డి సోమల రాజు ఫౌండేషన్ రాజు ఆధ్వర్యంలో సన్మాన కార్యక్రమాలను నిర్వహించారు. సన్మాన గ్రహీతలు డా.సత్య నిర్ధారణ, ఓలా ప్రభాకర్లు మాట్లాడుతూ మాకు ఈ గౌరవం ఇవ్వడంతో మరింత బాధ్యత పెరిగిందని, పేద ప్రజలకు మరిన్ని సేవలను మున్ముందు చేస్తామని తెలిపారు.

బీసీ వెల్ఫేర్ డిడి నిర్మల జ్యోతిపై చర్యలు తీసుకోండి

విశాలాంధ్ర-పుట్టపర్తి : వసూళ్లకు పాల్పడుతున్న సత్యసాయి జిల్లా బీసీ సంక్షేమ శాఖ డిడి నిర్మల జ్యోతిని సస్పెండ్ చేయాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు శేషం మహేంద్ర ఆదివారం సిపిఐ కార్యాలయంలో శేషం మహేంద్ర విలేకరులతో మాట్లాడుతూ సత్య సాయి జిల్లా పరిధిలోని సంక్షేమ వసతి గృహాల్లో విధులు నిర్వహిస్తున్న వార్డెన్ ల నుంచి అక్రమంగా వసూళ్లకు పాల్పడుతోందని అన్నారు. అవినీతి బాగోతం గురించి ఇప్పటికే పత్రికల్లో వచ్చిందని, పక్క ఆధారాలు, ఫోన్ పే ట్రాన్సాక్షన్స్ ఉన్నాయని తెలియజేశారు . సత్య సాయి జిల్లా కలెక్టర్ కి తమ దగ్గర ఆధారాల్ని ఆమె చేస్తుంటే అవినీతిని బయట పెడతామని ఏఐఎస్ఎఫ్ రాజు,విశ్వసాయి,ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

భారీగా బంగారం నగదు దోపిడీ

విశాలాంధ్ర-తనకల్లు: మండల పరిధిలోని మండ్లి పల్లి గ్రామంలో బొమ్మిరెడ్డి మల్లికార్జున్ రెడ్డి ఇంటి నందు భారీగా బంగారం నగదు చోరి అయిన సంఘటన చోటుచేసుకుంది. 25 తులాల బంగారం 26 తు లాలు వెండి మూడు లక్షలు నగదు అపహరణకు గురైందని బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై గోపి తెలిపారు సంఘటన స్థలాన్ని కదిరి డిఎస్పి రూరల్ సీఐ సందర్శించి క్లూస్ టీం డాగ్ స్క్వాడ్ తో విచారణ చేపట్టారు.

నేడు చింతతోపు బహిరంగ వేలం

విశాలాంధ్ర - అగళి : మండలంలోని మధూడి గ్రామపంచాయతీలోని చింతచెట్ల ఫలసాయానికి నేడు (సోమవారం) ఉదయం 10 గంటలకు స్థానిక సచివాలయం వద్ద బహిరంగ వేలం ఈఓఆర్‌డి పద్మ ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్లు పంచాయతీ కార్యదర్శి పణిరాజు తెలిపారు. ధరావతు రూ.2 వేలు చెల్లించి పాల్గొనవచ్చన్నారు.

గ్యాస్‌కు అధిక ధరలు వసూలు చేస్తే చర్యలు

విశాలాంధ్ర-సోమందేపల్లి: గ్యాస్ ఏజెన్సీలు ప్రభుత్వ నిర్దేశించిన ధర కంటే అధిక ధరకు గ్యాస్ బండలకు వసూలు చేస్తే చర్యలు తీసుకుంటామని సి ఎస్ డిటీ మోహన్ నాయక్ పేర్కొన్నారు. ఆదివారం మండలంలోని గీతా నగర్ తదితర ప్రాంతాల్లో వినియోగదారుల ఇంటింట రాండమ్ సర్వే నిర్వహించారు.

యూటీఎఫ్ మోడల్ పేపర్ల వితరణ

విశాలాంధ్ర-ధర్మవరం : పదవ తరగతి విద్యార్థుల కోసం యూటీఎఫ్ 100 రోజుల ప్రణాళికతో రూపొందించిన మోడల్ పేపర్లను ఆదివారం స్థానిక యుటిఎఫ్ ప్రాంతీయ కార్యాలయంలో పారిశుద్ధ్య కార్మికులు, అంగన్వాడీ కార్యకర్తలు, ఆయాల పిల్లలకు 46 మందికి ఉచితంగా పంపిణీ చేసినట్లు, ముఖ్య అతిథి యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి జిల్లా అధ్యక్షులు శెట్టిపి జయచంద్రారెడ్డి తెలిపారు. మోడల్ పేపర్స్‌ను బాగా చదివి మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించి మన ఊరికి, తల్లి తండ్రులకు పాఠశాల ఉపాధ్యాయులకు మంచి పేరు తేవాలని కోరారు. కార్యక్రమంలో స్థానిక సిఐటియు నాయకులు జెవి రమణ, ధర్మవరం యుటిఎఫ్ జోన్ నాయకులు రామకృష్ణ నాయక్, ఆంజనే యులు, అమర్ నారాయణరెడ్డి, వెంకట కిషోర్ పాల్గొన్నారు..

ల్యాబ్ టెక్నీషియన్ కమిటీ ఏర్పాటు

విశాలాంధ్ర-ధర్మవరం: పట్టణంలోని ఎన్జీవో హోం లో ధర్మవరం మెడికల్ ల్యాబ్ టెక్నీషియన్ అసోసియేషన్ కమిటీ ని ముఖ్యఅతిథి రాష్ట్ర ఉపాధ్యక్షులు నవీన్ కుమార్ ఆధ్వర్యంలో ఎంపిక చేసుకున్నారు. అసోసియేషన్ అధ్యక్షుడిగా అంజన్ రెడ్డి, ఉపాధ్యక్షులుగా సయ్యద్, కోశాధికారిగా రవి, కార్యదర్శిగా మనోహర్‌తో పాటు సభ్యులను కున్నట్లు తెలిపారు. అనంతరం రాష్ట్ర ఉపాధ్యక్షులు నవీన్ కుమార్ నూతన కమిటీకి శుభాకాంక్షలు తెలియజేశారు. ఎన్నికైన కమిటీ వారు మాట్లాడుతూ మెడికల్ ల్యాబ్ టెక్నీషియన్ సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తామని తెలిపారు.

మానవతను చాటిన సంధా రాఘువ

విశాలాంధ్ర-ధర్మవరం : పట్టణంలోని వైయస్సార్ కాలనీకి చెందిన శ్రీరాములు అనాధగా మృతి చెందారు. సంతానం లేకపోవడంతో కట్టుకున్న భార్య అనారోగ్యంతో హాస్పిటల్‌లో ఉండడంతో అంత్యక్రియలకు జరపడానికి ఇబ్బంది పడుతున్న విషయాన్ని తారక్ చేయుట ట్రస్ట్ అధ్యక్షులు రామాంజి, ప్రముఖ పట్టణ దానశీలి సంధ రాఘవ దృష్టికి తారక్ చైతన్ వారు తెలియజేయడంతో, వెంటనే అంత్యక్రియల నిమిత్తం రూ.6 వేలను కుటుంబ సభ్యులకు ట్రస్టు ద్వారా అందజేశారు. ట్రస్ట్ వారు సంధ రాఘవాకు కృతజ్ఞతలు తెలియజేశారు.

ఘనంగా గోదాదేవి కల్యాణం

విశాలాంధ్ర-ధర్మవరం: పట్టణంలోని పిఆర్టి వీధిలో గల శ్రీ పాండురంగ స్వామి దేవస్థానంలో శ్రీ గోదా రంగనాయకుల కళ్యాణ మహోత్సవ వేడుకలు ఆలయ ఈవో నాగరత్నమ్మ ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు. 32వ వార్షికోత్సవం సందర్భంగా ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేయడం పట్ల వారు సంతోషాన్ని వ్యక్తం చేశారు. అర్చకులు శ్రీధర్ శర్మ ప్రత్యేక పూజలు, అభిషేకాలను, వేదమంత్రాలు మంగళ వాయిద్యాల నడుమ నిర్వహించారు. శాశ్వత నిధికి దాతలు ఇచ్చిన మొత్తము ధర్మారంలోని సిటీ యూనియన్ బ్యాంక్ అండ్ స్టేట్ బ్యాంక్ నందు ఫిక్స్ డిపాజిట్ చేశామని, ఆ డిపాజిట్‌పై వచ్చు వడ్డీతో ఏటా కల్యాణోత్సవం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పరిసే మునయ్య భజన మండలి వారు ఆలపించిన అన్నమయ్య కీర్తనలు అలరించాయి. వెయ్యి మందికి అన్నదానం చేశారు. ఆలయ కమిటీ, గోదా రంగ నాయకుల కళ్యాణ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

కేతిరెడ్డి కలిసిన వైసిపి నాయకులు

విశాలాంధ్ర-ధర్మవరం : పట్టణంలోని ఎస్బిఐ కాలనీలో గల మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డిని ఆదివారం వైసిపి నాయకులు మర్యాద పూర్వకంగా కలిశారు. పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు మాసపల్లి సాయికుమార్ కేతిరెడ్డి వెంకటరామిరెడ్డికి పుష్ప గుచ్ఛం అందజేసి దుశ్శాలుతో సత్కరించారు. కేతిరెడ్డి మాట్లాడుతూ.. మాజీ సీఎం జగన్మోహన్ రెడ్డి పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడిగా మాసపల్లి సాయికుమార్‌ను నియమించడం సంతోషకరంగా ఉందన్నారు. ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. సాయికుమార్ మాట్లాడుతూ.. మాజీ సీఎం జగన్మోహన్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి నాపై ఉంచిన నమ్మకం మేరకు వచ్చే ఎలక్షన్లో వైసిపి పార్టీ గెలుపు కోసం విశేష కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్ గజ్జల శివ, కత్తే పెద్దన్న, వైఎస్ఆర్సిపి నాయకులు చిన్నూరు తిమ్మన్న, చిన్నూర్ రమేష్, దాసరి శ్రీనివాసులు, పెద్దిరెడ్డి గారి శ్రీనివాసులు పాల్గొన్నారు.

గోశాలకు శంకుస్థాపన

విశాలాంధ్ర-చిలమత్తూరు: దేమకైతే పల్లి పంచాయతీ పరిధిలోని యజ్ఞశెట్టిపల్లి గ్రామ సమీపంలోని గోషాలకు ఆదివారం దక్షిణామ్నాయ శృంగేరి పీఠాధీశ్వరులు జగద్గురు శంకరాచార్యభారతీతీర్థ మహాసన్నిధానం వారు, తత్కరకమల సంజాతులు జగద్గురు విదుశేఖర భారతీ సన్నిధానం మహాస్వామి వారు శంకుస్థాపన కార్యక్రమాన్ని తమ అమృత హస్తములతో నిర్వహించారు. ముంబై శృంగేరి శంకర మఠం ప్రధాన అర్చకులు అయిన మన యజ్ఞిశెట్టిపల్లి వాస్తవ్యులు నిఖిల్ శర్మ, తేజేష్ శర్మ యాజ్ఞిశెట్టిపల్లి వంశీకులు గ్రామస్థులు చిలమత్తూరు బ్రాహ్మణ సేవా సంఘం వారు పాల్గొన్నారు.

విశాలాంధ్ర అనంతపురం/సత్యసాయి
www.visalaandra.com
కర్నూలు, ఆదివారం 19, జనవరి 2025

రహదారులపై రైతుల కళ్ళాలు

ప్రమాదాలపాలవుతున్న వాహనదారులు
పట్టించుకోని రహదారులు భవనాల శాఖ అధికారులు

విశాలాంధ్ర-గుత్తి: గుత్తి నుండి గుంతకల్లుకు వెళ్లే గుత్తి ఔటర్ రింగ్ రోడ్డు మోకాళ్ళ లోతు గుంతలు ఒకవైపు .. మరోవైపు చుట్టుపక్కల గ్రామాల ప్రజలు ఆ రోడ్లపైనే పంట నూర్పిళ్లు చేసుకుంటుండటం ఆందోళన కల్గిస్తున్నది. వాహనదారుల కంట్లో పంటనూర్పిడి పడటంతో పాటు అదుపు తప్పి ప్రమాదాల పాలవుతున్నారు. ప్రస్తుతం గ్రామాల్లో పశువులు లేవు.. పెద్ద పెద్ద గడ్డి వాములు లేవు, ఉన్న స్థలం విపరీతంగా ధర పలుకుతోంది. దీంతో పంట కోతకు వచ్చిన తరువాత సంసారం అంతా రోడ్డు మీదే... అక్టోబర్‌లో ఆముదం, నవంబర్‌లో మిర్చి, డిసెంబర్‌లో మొక్కజొన్న, జనవరి ఫిబ్రవరిలో కంది చేతికి రావడంతో రాత్రిపూట రోడ్లోనే పడుకుంటున్నారు. పంట వ్యర్థాలు తౌడు, ఈనెలు, కొయ్యలు, కంకులు అలాగే వదిలేసి వెళుతున్నారు. వాటికి దారినపోయే పోకిరీలు నిప్పంటి స్తుంటారు. కిలోమీటర్లు అగ్ని జ్వాలలు లేస్తున్నాయి. పొదలతో పాటు పచ్చనిచెట్లు అగ్నికి దహనమవుతున్నాయి. వాహనాలువెళ్లాలంటే ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని ప్రయాణం చేయాల్సిందే. గతేదాది వేసిన రోడ్లు పూర్తిగా నాసిరకంగా ఉండటంతో నడుములోతు గుంతలు దరసనమిస్తున్నాయి. విపరీతమైన రద్దీ మూలంగా పెద్ద గుంతలు ఏర్పడి ప్రయాణికులను తీవ్ర ఇబ్బందికి గురవుతున్నారు. రైల్వేస్టేషన్, టమోటా మార్కెట్, చెట్నేపల్లి, నూర్సింగపల్లి వరకు ఇల్లు విస్తరించడం అలాగే విద్యాల యాలు ఎక్కువగా ఉండటంతో పత్తికొండ రోడ్డు నిత్యం రద్దీగా ఉంటున్నది. గత ఎనిమిది సంవత్సరాలుగా రజాపురం బ్రిడ్జి నిర్మాణం పూర్తికాలేదు. మార్నెంపల్లి పెద్దొడ్డి రోడ్డు కోతకు గురైనది. కొంగనపల్లి, వైటీ చెరువు రోడ్డు అధ్వానంగా ఉంది. పల్లెలకు వెళ్లే మార్గాలు నరకప్రాయంగా మారాయి. మాము దూరు అబ్బేదొడ్డి, తురకపల్లి న్యమతాబాదు, అణగన దొడ్డి, పి.ఎర్రగుడి, గురబ్బాడు, నాగసముద్రం దార్లు అధ్వాన్నంగా తయారయ్యాయి. జిల్లాలోని పలు ప్రధాన రహదారులు, స్టేట్ హైవే, గ్రామీణ రహదారులు అధ్వాన్నం గా మారటంతో వాహనాల్లో ప్రయాణం ప్రమాద కరంగా మారటంతో ఆయా గ్రామాల ప్రజలు భయాందోళనలు చెందు తున్నారు. వీరితో పాటు వాహన యజమానులు కూడా ఇబ్బందులు ఎదుర్కొం టున్నారు. వారం రోజులుగా కురుస్తున్న వర్షాలకు మిడుతూరు పెద్దవడుగూరు, కిష్టిపాడు, చిత్రచేడు, మొలకతాళ్ళ గ్రామీణ ప్రాంత రోడ్లు దుర్భరంగా తయార య్యాయి. ఇది మంచి ప్రభుత్వం - పనిచేస్తుందని స్టిక్కర్లు ఇళ్లకు అతికించే కార్యకర్తలతో కనీసం రోడ్డు పూడ్చితే ప్రభుత్వం పనిచేస్తుందని పించుకుంటుంది. రోజూ ఎక్కడో ఒకచోట ఈ దారిపై ప్రమాదం జరుగుతున్నా ప్రభుత్వానికి అధికారులకు చీమకుట్టినట్టు లేదు. రోడ్లపై నెలల తరబడి కాపురాలు ఉంటున్నా రహదారి భవనాల శాఖ వారు మొద్దు నిద్రలో జోగుతున్నారు. ప్రధాన రహదారులలో పచ్చని గడ్డి, క్రోటన్స్, గన్నేరు, కాగితం పూల చెట్లు మసి బొగ్గులు తయారవుతున్న చోద్యం చూస్తున్నారు. పంట వ్యర్థా లను ప్రభుత్వం రైతుల సహకారంతో సేంద్రియ ఎరువుగా మార్చడానికి ముందుకు రావాలి. ఇప్పటికైనా రైతులకు అవగాహన కల్పించి ప్రమాదలకు అడ్డువేయాలి..

క్రీడాకారులు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించాలి

అనంతపురం కలెక్టర్ వినోద్ కుమార్

విశాలాంధ్ర-అనంతపురం: అనంతపురం జిల్లా నుండి మరింత మంది క్రీడాకారులు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించే విధంగా ఫిట్నెస్ పెంచుకోవాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్.వి పిలుపునిచ్చారు. ఆదివారం ఉదయం ఆర్డీటీ ఆధ్వర్యంలో నిర్వహించిన 10కె రన్ మరియు 5కె వాక్ మూడవ ఎడిషన్ జనవరి 2025 కార్యక్రమాన్ని నగరంలోని జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద నుండి పచ్చ ఆరెంజ్ జెండాలు ఊపి జిల్లా కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. అనంతపురంలో 10కె రన్ మరియు 5కె వాక్ మూడవ ఎడిషన్ జనవరి 2025 కార్యక్రమాన్ని జరుగుతున్నందుకు చాలా సంతోషంగా ఉందన్నారు. అలాగే విదేశాల నుండి స్పెయిన్, మరియు అబ్రాడ్ నుండి వచ్చిన వారికి అనంతపురం జిల్లా తరఫున అభినందనలు తెలుపుతున్నానన్నారు. అలాగే ఇక్కడ ఈ పోటీలో పాల్గొంటున్నటువంటి యువతీయువకులకు, అలాగే ఇక్కడ వచ్చినవారు శారీరకంగా వయసు పైబడిన కూడా మానసికంగా యుక్త వయసు కలిగిన వారిగా ఉన్నారని, ఈ కార్యక్రమంలో పాల్గొన్నటువంటి వారికి ధన్యవాదములు తెలిపారు. అలాగే ముస్సూరీ ప్రాంతంలో కలెక్టర్ గా శిక్షణ తీసుకునే సమయంలో ఇలాంటి పోటీల్లో 11వ స్థానంలో నిలిచానని, కానీ ఈ రోజున చిన్న గాయం కారణంగా ఈ పోటీలో పాల్గొన్న లేకపోతున్నానని, ఈ పోటీలలో జిల్లా జాయింట్ కలెక్టర్ పాల్గొంటారని తెలిపారు. ఆర్డిటి, పోలీస్, ఫైర్, రెవెన్యూ, మున్సిపల్ కార్పొరేషన్ శాఖల వారు ఈకార్యక్రమానికి విజయవంతంగా పూర్తి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్డీటీ ప్రోగ్రామ్ డైరెక్టర్ మాంచు ఫెర్రర్ ఫెర్రర్ మాట్లాడుతూ... పదవ ఆల్టా ఫెర్రర్ రన్నింగ్ వారమని పది సంవత్సరాల క్రితం ఒకరితో ప్రారంభమై ఈ రోజున ఇంతమంది రన్నర్స్ రావడం చాలా సంతోషంగా ఉందన్నారు. 10కె రన్‌లో జేసీ శివ్ నారాయణ్ శర్మ కలెక్టరేట్ నుంచి అనంతపురం స్పోర్ట్స్ విలేజ్ వరకు పోటీలో పాల్గొని విజయవంతంగా పరుగును పూర్తి చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అటవీ అధికారి శ్రీనివాసరెడ్డి, ఆర్డీటీ మహిళా సాధికారత డైరెక్టర్ విషా ఫెర్రర్, ఆర్డీటీ చైర్‌పర్సన్ తిప్పేస్వామి, మరియు జువాన్ మాన్యుయేల్ వియెరా (అల్టరన్నర్) పాల్గొన్నారు.

జర్నలిస్టులకు ఆదర్శం నందినేని దేవప్రసాద్

సంతాప సభలో శ్లాఘించిన జర్నలిస్టుల
ఏపీయూడబ్ల్యూజే ఆధ్వర్యంలో ఘన నివాళి

విశాలాంధ్ర-అనంతపురం: జర్నలిజం రంగంలో తనదైన సేవలు అందించిన ప్రెస్ క్లబ్ పెద్దాయన, మొదటి తరం సీనియర్ జర్నలిస్టు నందినేని దేవప్రసాద్ నేటి, భవిష్యత్ తరాల జర్నలిస్టులకు ఆదర్శప్రాయులని పలువురు సీనియర్ జర్నలిస్టులు అభిప్రాయం వ్యక్తం చేశారు. ఆంధ్రప్రదేశ్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ (ఏపీయూడబ్ల్యూజే) అనంతపురం జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఆదివారం అనంతపురంలోని జిల్లా ప్రెస్ క్లబ్ నందు సంతాప సభ ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా దేవప్రసాద్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించి, జర్నలిస్టు దేవప్రసాద్ అమర్ రహే అంటూ నినాదాలు చేశారు. ఏపీయూడబ్ల్యూజే జిల్లా అధ్యక్షులు పయ్యావుల ప్రవీణ్ అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో పలువురు సీనియర్ ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టులు, ఫోటో, వీడియో జర్నలిస్టులు పాల్గొన్నారు. ప్రెస్ క్లబ్ కు పెద్ద దిక్కుగా ఆయన ఎంతో హుందాగా, అజాతశత్రువుగా అందరికీ మిత్రుడుగా సేవలందించారని, జర్నలిస్టుగా అన్ని రంగాల వారికి సుపరిచితుడైన ఆయన లేని లోటు తీర్చలేనిదని అన్నారు. కార్యక్రమంలో పయ్యావుల ప్రవీణ్ అధ్యక్షోపన్యాసం చేస్తూ దేవ ప్రసాద్ లేని లోటు ఎవరు తీర్చలేనిది అన్నారు. ఆయన అజాతశత్రువుగా, తేజ ప్రసాద్‌గా, జెమినీ ప్రసాద్‌గా పేరు తెచ్చుకున్నారన్నారు. వార్త బ్యూరో ఇంచార్జ్ రాచమల్లు భోగేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ జర్నలిస్టుగా ఎలక్ట్రానిక్ మీడియాలో తనదైన ముద్ర వేసుకుని తన జీవితాన్ని సార్థకం చేసుకున్నారన్నారు. తీవ్ర అనారోగ్యానికి గురైన ఆయనకు ప్రెస్ క్లబ్ మిత్రులు అండదండగా ఉండి అందించిన సేవలు మరువలేని అన్నారు. ప్రతి ఒక్కరూ వృత్తి ధర్మం నెరవేరుస్తూ ఆరోగ్యాన్ని కాపాడుకోవాల్సిన అవసరం ఉందన్నారు. అలాగే ఈ వృత్తిలో కొనసాగుతున్న పాతవారికి అవకాశాలు ఇవ్వాలని సూచించారు. ఏపీయూడబ్ల్యూజే జిల్లా ప్రధాన కార్యదర్శి ఆయుష్ మాట్లాడుతూ నందినేని ప్రసాద్ ప్రతి ఒక్కరితో సన్నితంగా ఉంటూ, సౌమ్యుడిగా పేరు తెచ్చుకొని, అందరి మన్ననలు పొంది తన జీవితాన్ని సార్థకం చేసుకున్నారన్నారు. సీనియర్ జర్నలిస్టులు మార్కండేయులు, ప్రభాకర్ నాయుడు, ప్రజాభూమి ఎడిటర్, ఏపీయూడబ్ల్యూజే మాజీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు కేపీ.కుమార్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు జయరాం, ఎలక్ట్రానిక్ మీడియా అధ్యక్షులు జగదీష్, సబ్ ఎడిటర్ రామాంజనేయులు, పూలశెట్టి చలపతి, సాక్షి, జీ తెలుగు టీవీ రిపోర్టర్లు శివారెడ్డి, సాయి ప్రసాద్, ఆంధ్రప్రభ ఎడిషన్ ఇంచార్జ్ లోకరాజు, సీనియర్ జంబుల రమేష్‌రెడ్డి, ఫోటో జర్నలిస్టుల అసోసియేషన్ ప్రెసిడెంట్ డేనియల్, ఆంధ్రజ్యోతి ఫోటో జర్నలిస్ట్ కృష్ణ, జర్నలిస్టులు నాగేంద్ర రెడ్డి, బీవీ రెడ్డి, ఆనంద వర్ధన్, భుజంగరావు, రామచంద్ర, ప్రింట్ ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టులు పాల్గొన్నారు. అనారోగ్యంతో బాధపడుతూ ఆదివారం మృతి చెందిన మాజీ రిపోర్టర్ (కళ్యాణదుర్గం) పురుషోత్తం మృతికి సభ నివాళు లర్పించింది.

రోడ్డుకు ఇరువైపులా కంప చెట్లను తొలగించండి ..

విశాలాంధ్ర-నంబులపూలకుంట: మండల కేంద్రం నుండి పెడబల్లి వరకు ఉన్న రహదారికి ఇరువైపులా కంప చెట్లు,పిచ్చి మొక్కలు ఏపుగా పెరిగి ఎదురుగా వచ్చే వాహనాలు కనబడక ప్రమా దాలు జరుగుతున్నాయని ప్రజలు వాపోతున్నారు. సింగిల్ రోడ్డు కావడంతో లారీలు, బస్సులు వచ్చినప్పుడు కంపలు గీసుకుని గాయాల పాలవుతున్నామని వాహనదారులు, ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రోడ్డుకు ఇరువైపులా పరికి చెట్లు,తంగేడు,బెల్లం చెట్టు,మగవేరు చెట్లు ఏపుగా పెరిగి ప్రమాదకరంగా మారాయని, సంభందిత అధికారులు చెట్లను తొలగించేం దుకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ప్రజా కవి యోగి వేమనకు ఘనంగా నివాళి

విశాలాంధ్ర-చిలమత్తూరు : మానవుని హీనస్థితికి కారణమైన వ్యవస్థలపై తిరుగుబాటు చేసిన మహనీయుడు ప్రజాకవి యోగి వేమన అంటూ ఎంపీడీవో రమణమూర్తి కొనియాడారు, శ్రీ యోగి వేమన జయంతిని మండల కేంద్రంలోని స్థానిక ఎంపీడీవో, తహసిల్దార్ కార్యాలయములలో ఆదివారం సిబ్బంది ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తొలుత యోగి వేమన చిత్రపటానికి పూల మాలను వేసి ఘనంగా నివాళు లు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగు జాతిని, తెలుగువారి కీర్తిని దశదిశలా తీసుకెళ్లిన మహాకవి యోగి వేమన అని తెలిపారు. ప్రజల జీవన ప్రమాణాలను తన పద్య రూపంలో రచించి ప్రజా కవిగా గుర్తింపబడ్డారని పేర్కొన్నారు. ముఖ్యంగా "విశ్వదాభిరామ వినురవేమ" అనే మాట వినని తెలుగువారు ఉండరని, ఒక్క వేమన పద్యం కూడా రాని తెలుగు వారు ఉండరని తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు అధికారులు పాల్గొన్నారు.

యోగి వేమన వ్యాక్యాలు అనుసరణీయం

విశాలాంధ్ర-ముదిగుబ్బ: మహర్షి, ప్రజాకవి అయిన "యోగి వేమన జయంతి సందర్భంగా, తహసిల్దార్ కార్యాలయంలో తహసిల్దార్ నారాయణస్వామితో కలిసి మండల క్లస్టర్ ఇంచార్జ్ తుమ్మల మనోహర్ లు ఘనంగా జయంతి వేడుకలు నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వందల సంవత్సరాల క్రితం యోగివేమన పద్యాల రూపంలో వివరించిన నీటి వాక్యాలు చెప్పిన ఇప్పటికీ మానవులంతా ఆచరణనీయం అన్నారు. యోగివేమన సాధారణ కుటుంబంలో జీవించిన ఒక మానవతావాదిగా ఆయన చూపిన దారి అనుసరణీయం, ఆదర్శం ఒక విధంగా ముదిగుబ్బ మండలం లోని ఏబిపల్లి తండా జలాశయానికి యోగివేమన పేరు పెట్టడం వలన ఆ మహా వ్యక్తికి ఘనంగా నివాళు లర్పించారు.ఈ కార్యక్రమంలో తహసిల్దార్ కార్యాలయ సిబ్బంది టిడిపి నాయకులు పాల్గొన్నారు.

శాంతి భద్రతలకు విఘాతం కలిగించవద్దు

విశాలాంధ్ర-తాడిపత్రి: శాంతి భద్రతలకు విఘాతం కలిగించద్దండని రూరల్ సీఐ శివగంగాధర్ రెడ్డి రౌడీ షీటర్లకు హెచ్చరించారు. ఆదివారం రూరల్ పోలీస్ స్టేషన్లో మండలంలోని సజ్జలదిన్నె, ఆలూరు, వెలమకూరు, బ్రాహ్మణపల్లి, ఇగుడూరు, కావేరి సముద్రం తదితర గ్రామాలలో ఉన్న రౌడీ షీటర్లకు, హత్య కేసులో ఉన్న నిందితులకు రూరల్ సీఐ శివగంగాధర్ రెడ్డి కౌన్సిలింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాలలో ఎవరితో కానీ చిన్నచిన్న తగాదాలకు వెళ్లొద్దన్నారు. ఏవైనా సమస్యలు వచ్చినప్పుడు పోలీస్ స్టేషన్ కు వచ్చి ఫిర్యాదు చేయాలన్నారు. గ్రామాలలో శాంతియుతానికి భగ్నం కలిగిస్తే కఠిన చర్యలు తప్పని హెచ్చరించారు. కావున ప్రతి ఒక్కరు గొడవలకు వెళ్లకుండా శాంతియుతంగా జీవితం కొనసాగించాలని సూచించారు.

శివమాల దారులు ప్రసాద పంపిణీకి సరుకులు వితరణ..

విశాలాంధ్ర-పెనుకొండ: పెనుకొండ పట్టణంలోని టిడిపి కార్యా లయంలో మంత్రి సవితమ్మ భర్త వెంకటేశ్వర రావు, శివమాలదారులు ప్రసాద వితరణ కోసం 20,000 రుపాయల విలువ గల బియ్యం, సరుకులు, నగదు విరాళం చేయడం జరిగింది, శివ మాలదారులు పట్టణంలోని పై ఐముక్తేశ్వర ఆలయంలోని, ప్రతిరోజు పూజలు చేస్తూ వచ్చే భక్తులకు ప్రసాద పంపిణీ జరుగుతుంది, అందుకోసం మంత్రి సవితమ్మ కుటుంబ సభ్యులు, ప్రసాద పంపిణీకి, కావలసిన సరుకులు పంపిణీ చేశారు, ఈ కార్యక్రమంలో శివ మాలధారణ భక్తులు మోహన్ నాయక్, రామకృష్ణ నాయక్, వెంకటేష్, టిడిపి నాయకులు శ్రీరాము లు,శరత్, ప్రసాద్, రవి, శుబహాన్, గోపాల్,సాయి రమేష్, తదితరులు పాల్గొన్నారు.

నారాయణ సేవలో అన్నదానం

విశాలాంధ్ర-పెనుకొండ : పెనుకొండ సంతకు వచ్చిన వివిధ గ్రామాల వారికి, ఆదివారం అయ్యప్ప స్వామి దేవాలయం వద్ద పేదలకు యాచకులకు , నారాయణ సేవలో భాగంగా నారాయణ సేవలో భాగంగా సుమారు180 మందికి అన్నదానం, అరటి పండ్లు, త్రాగునీరు, అందజేసారు,ఈ కార్యక్రమానికి రంజిత్ కుమార్ గాయత్రి ,కీర్తిశేషులు అయిన వీరి తల్లిదండ్రులు,ఎస్ రామచంద్రప్ప, ఈశ్వరమ్మ, జ్ఞాపకార్థం సహకరించి కుటుంబ సభ్యులతో కలసి ఈ సేవా కార్యక్రమంలొ పాల్గొని సేవలు అందించినారు, ఈశ్వరమ్మ,రామచంద్రప్ప, ఆత్మ శాంతి కలిగి,ఈ సేవా కార్యక్రమానికి సహకరించిన వారికి, ఈ సేవ కార్యక్రమంలో పాల్గొన్న వారికి అందరికీ భగవాన్ బాబావారి యొక్క అనుగ్రహ ఆశీస్సులు కలిగి ఉండాలని శ్రీ సత్య సాయి బాబా తాలూకా సేవా సమితి అధ్యక్షుడు శంకర్ తెలిపారు.

ఆధార్ కార్డుల కోసం అగలి మండల ప్రజల అగచాట్లు

విశాలాంధ్ర - అగళి : అగళి మండలంలో ఆధార్ నమోదు కేంద్రం మండల ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారు. ఆధార్ కార్డులో మార్పులు.పేరు, పుట్టిన తేదీ, గ్రామము, బయోమెట్రిక్, ఫోటో, కొత్త ఆధార్ కార్డు పొందడం,ఫోన్ నెంబర్ లింక్ చేసుకోవడం, ఇంటి నంబరు వంటి సవరణ పనులకు ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారు. మండలంలో ఆధార్ కేంద్రాలు లేకపోవడంతో అర్హులైన లబ్ధిదారులు ప్రభుత్వ పథకాలకు దూరమవుతున్నారు. ఆధార్ లో తప్పులు ఉన్న సవరించుకోవడానికి నానా తిప్పలు పడుతున్నారు. మండలంలో నరసంబూది, కోడిపల్లి,అగళి సచివాలయాలలో ఆధార్ కేంద్రాలను ఏర్పాటు చేసింది. నరసంబుధిలో డిజిటల్ అసిస్టెంట్ గా పని చేస్తున్న ఆనంద్ బాబు వేరే మండలానికి బదిలీపై వెళ్లారు. కోడిపల్లి పంచాయతీలో పనిచేస్తున్న ఆమె మెటర్నటీ లీవ్ లో వెళ్లారు. అగళి సచివాలయంలో నూతన డిజిటల్ అసిస్టెంట్ గా గత పది రోజుల క్రితం రవికుమార్ ను నియమించినారు అప్పటినుంచి ఆధార్ అప్డేట్స్ ప్రారంభిస్తామని చెబుతున్నారు కానీ టెక్నికల్ ప్రాబ్లమ్ ఉందని ఇంతవరకు ఆధార్ కేంద్రం ప్రారంభం కాకపోవడం శోచనీయం.ప్రస్తుతం మూడు ఆధార్ కేంద్రాలను మూసివేశారు.దీంతో మండల ప్రజలు ఆధార్ లో ఉన్న తప్పులను సరిదిద్దు కోవడానికి వేలిముద్రలు రాకున్నా ఇంటి నంబర్లు మార్చుకోవాలంటే ఆధార్ కేంద్రాలకు వెళ్లాల్సి వస్తోంది. ప్రజలు ఆధార్ కేంద్రం వద్దకు వెళ్లి చూడగా టెక్నికల్ ప్రాబ్లం ఉందని చెబుతున్నారు.సమస్యలను పరిష్కరించే ప్రభుత్వ అధికారులు సహకరించడం లేదని ఎవరితో చెప్పుకోవాలో తెలియని స్థితిలో ఉన్నామని ప్రజలు ఆవేదన చెందుతున్నారు. మండలంలో ఆధార్ సెంటర్ లేకపోవడంతో రొళ్ళ మండలం వట్టిబెట్ట సచివాలయానికి సుదూర ప్రాంతాలైన కర్ణాటకలో సిరా మధుగిరి తదితర పట్టణాలకు వందల రూపాయలు వెచ్చించి వెళ్లాల్సి వస్తోందని అది కూడా ఒక్కసారికే పనులు కావడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బెంగళూరు ఫ్యాక్టరీలలో పనిచేస్తున్న వారు రెండు మూడు రోజులు సెలవు పెట్టి ఆధార్ తప్పులను సవరించుకోవడానికి అగళి మండల కేంద్రానికి వస్తే ఆధార్ కేంద్రం ఉందని ఎవరు చెప్పారని నవ్వుకుంటున్నారు. కావున ఇప్పటికైనా స్థానిక అధికారులు ఉన్నతాధికారులు స్పందించి వెంటనే సమస్య ఏదైనా సరే పరిష్కరించి ఆధార్ నమోదు కేంద్రాలు ఏర్పాటు చేయాలని మండల ప్రజలు కోరుతున్నారు.

పేకాట రాయుళ్లు అరెస్టు..

విశాలాంధ్ర- బొమ్మనహాళ్: మండలంలోని దర్గాహొన్నూరు గ్రామ శివారులో అధివారం పేకాట ఆడుతున్నా ఏడుగురిని బొమ్మనహాళ్ పోలీసులు అరెస్టు చేశారు. ఎస్ఐ నబీరసూల్ తెలిపిన వివరాలు మేరకు గ్రామానికి చెందిన ఏడుగురు వ్యక్తులు గ్రామ సమీపం లోని ముళ్లకంపలో పేకాట ఆడుతున్నారని సమాచారం రావడంతో తన సిబ్బందితో దాడులు నిర్వహించి ఏడుగురిని అదుపులోకి తీసుకోని వారి వద్ద నుంచి రూ.3500 నగదును స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు.

వివాహానికి హాజరైన వైసీపీ నాయకులు బాలా రమేష్ బాబు..

విశాలాంధ్ర-యాడికి : మండల కేంద్రంలో నీ జామియా మసీదు ఫంక్షన్ హాల్ లో పూల రజాక్ కుమర్తె, కోటవీధిలోని కీ" శే" ఆర్టీసీ డ్రైవర్ మహబూబ్ బాషా కుమారుడు సచివాలయ ఉద్యోగి జంషిద్ షా వివాహానికి ఆదివారం యాడికి వైసిపి మండల సీనియర్ నాయకులు బాలా రమేష్ బాబు ముఖ్య అతిథులుగా హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలిపారు ఈ కార్యక్రమంలో బాలా సుబ్రమణ్యం (బాబు). భాస్కర్ రెడ్డి. శేఖర్‌రెడ్డి. మాబు హుస్సేన్ శంకర్. వెంకటేష్. ఏరికలప్ప. రామకృష్ణ చాంద్ బాషా పాల్గొన్నారు.

కర్ణాటక మద్యం స్వాధీనం..

విశాలాంధ్ర-పుట్టపర్తి : పుట్టపర్తి మండల పరిధిలోని రాజువారి పల్లి క్రాస్ వద్ద అక్రమంగా తరలిస్తున్న కర్ణాటక మద్యంను పట్టుకున్నట్లు ఎక్సైజ్ సీఐ నాగరాజు తెలిపారు. ఆదివారం శ్రీసత్యసాయి జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ ఉమ్మడి జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పుట్టపర్తి మండలంలో పలుచోట్ల అక్రమ మద్యం విక్రయిస్తున్న వారిపై ఎక్సైజ్ ఎస్ఐ ఉమామనోహర్ రాజు ,సిబ్బంది మెరుపు దాడులు నిర్వహించారు. కర్ణాటక మద్యం విక్రయిస్తున్న నిందితుడిని అదుపులోకి తీసుకొని 15 (90యం యల్) టెట్రా ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిపై కేసు నమోదు చేసి చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్సై ఉమా మనోహర్ రాజు, ఎక్సైజ్ సిబ్బంది పాల్గొన్నారు.

మనకి బాత్ వీక్షించిన ధర్మవరం వాసులు

విశాలాంధ్ర-ధర్మవరం: పట్టణంలోని 28వ వార్డు, 237 పోలింగ్ బూత్ లో బిజెపి నాయకులు ఏర్పాటుచేసిన ప్రధానమంత్రి నరేంద్ర మోడీ మంకీ బాత్ కార్యక్రమాన్ని ప్రజలు చక్కగా వీక్షణ చేశారు. ఈ సందర్భంగా బిజెపి పట్టణ అధ్యక్షులు జింక చంద్రశేఖర్ జిల్లా ఉపాధ్యక్షులు మాట్లాడుతూ ఈనెల చివరి ఆదివారం రిపబ్లిక్ డే కావడంతో ఈరోజు కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందని తెలిపారు.దేశంలోని వివిధ ప్రాంతాలలో ఉన్న ప్రాధాన్యత విషయాలను వారు ప్రస్తావించడం జరిగిందని తెలిపారు. ప్రధాన మంత్రి ఆదేశాల మేరకు ప్రజలకు చేరువ చేయాలన్న తలంపుతోనే ఈ మనకి బాత్ కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు శంకర చంద్రశేఖర్, మహేష్, ప్రజాపతి , నాగమణి, సుబ్రహ్మణ్యం, చంద్ర మహేష్, సాయి కృష్ణ, రవికుమార్, నాగలక్ష్మి, చంద్రశేఖరు ప్రసాదు కుమారు తదితరులు పాల్గొన్నారు.

అగలి మండల విద్యుత్ శాఖ ఏఈగా నాగరాజు..

విశాలాంధ్ర-అగళి : మండల విద్యుత్ శాఖ ఏఈగా నాగరాజు పదవీ బాధ్యతలు చేపట్టారు. మండలంలో గత రెండేళ్లుగా విద్యుత్ శాఖలో ఏఈ లేకపోవడంతో విద్యుత్ సంబంధిత ప్రజలు రైతులు తదితరులు అనేక ఇబ్బందులు పడ్డారు. ఎట్టకేలకు స్థానిక ఎమ్మెల్యే ఎంఎస్ రాజు. నియోజకవర్గ ఇన్‌చార్జి గుండుమల తిప్పేస్వామి చొరవతో నూతన ఏఈగా నాగరాజును నియమించారు. ఈ సందర్భంగా నాగరాజు మాట్లాడుతూ పుట్టపర్తి లో నిధులు నిర్వహిస్తూ బదిలీపై ఇక్కడికి రావడం జరిగింది అని అన్నారు. మండల ప్రజలు విద్యుత్కు సంబంధించి ఏ సమస్య ఉన్న మా దృష్టికి తీసుకొస్తే పరిష్కరిస్తామని అన్నారు. రైతులకు ఎల్లప్పుడూ అందు బాటులో ఉండి సేవలను అందిస్తామన్నారు.

మహాయోగి వేమన ఆదర్శప్రాయుడు

విశాలాంధ్ర-పెనుకొండ : పట్టణంలోని వేమారెడ్డి సర్కిల్ వేమన విగ్రహం వద్ద ఆదివారం వేమన జయంతి సందర్భంగా పూజా కార్యక్రమాలు చేసి అనంతరం కేక్ కటింగ్ చేసి వేమన మహత్యాన్ని సోదరులందరికీ తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వేమన సమాజ ఉద్ధరణకు సులువైన పదాలతో ఆటవెలది పద్యాలను రచించి ప్రజలను జాగృతి చేయడానికి ప్రయత్నించాడని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో రెడ్డి సోదరులు తదితర వ్యక్తులు పాల్గొన్నారు. వేమన జయంతి సందర్భంగా ఆసుపత్రిలో రోగులకు పండ్లు, బ్రెడ్డు పంపిణీ చేశారు.